
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



అందంలో.. తగ్గేదే..లే..

పెళ్లి ఓ అందమైన కల. ఆ మధుర స్వప్నం కలకాలం గుర్తుండిపోయేలా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.


- వివరాలు 8లో▸



చిన వెంకన్న దర్శనం

ద్వారకాతిరుమల: చిన తిరుపతిగా ఖ్యాతి కెక్కిన ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సుమారు పదివేల మంది భక్తులు దర్శించుకున్నారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 8.95 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ టీచర్ వివాదానికి తాత్కాలిక పరిష్కారం



చర్చల్లో పాల్గొన్న సీడీపీఓ రమాదేవి, నాయకులు

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం-95 టీచర్ సిద్దిరెడ్డి కనకదుర్గకు సంబంధించిన వివాదానికి తాత్కాలిక పరిష్కారం లభించింది. దీనిపై గ్రామస్తులతో అధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కనకదుర్గపై ఫిర్యాదులు రావడంతో ఆమెను అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-94కు బదిలీ చేసి, అక్కడ పని చేస్తున్న ఆర్.ప్రభావతిని 95 కేంద్రానికి మారుస్తామని అధికారులు ప్రతిపాదించారు. దీనికి గ్రామస్తులు అంగీకారం తెలిపారు. మూడు నెలల పాటు ఇలా పని చేసిన తరువాత, వివాదాలు, కేసుల పరిష్కారం అనంతరం తదుపరి చర్చలు జరిపేలా ఒప్పందం కుదిరింది. దీనిపై గ్రామస్తులతో అధికారులు ఒప్పంద పత్రాలు రాయించారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కనకదుర్గకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రామస్తులు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి, టీచర్‌ను పంపివేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఐసీడీఎస్ రాజోలుసీడీపీఓ వైకేడీ రమాదేవి, పోలీసుల సమక్షంలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇదే కేంద్రంలో కనకదుర్గ పని చేసేందుకు గ్రామస్తులు తొలుత అంగీకరించ లేదు. పెద్దలు, అధికారులు జోక్యం చేసుకుని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారు. మిగిలిన విషయాలపై జిల్లా అధికారులతో మాట్లాడాలని స్థానిక అధికారులు సూచించారు. సమావేశంలో సర్పంచ్ సుందర తాతాజీ, ఎంపీటీసీ సభ్యుడు సుందర శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కటికిరెడ్డి గోపాలకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండోకు ఎంపిక



జాతీయ తైక్వాండోకు ఎంపికైన భార్గవి శ్రీకళ, వైష్ణవి, కోచ్ త్రిమూర్తులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ అంతర్ జిల్లా కోరియోగి, పూమ్‌సే, రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. పూమ్‌సే విభాగంలో పితాని భార్గవి శ్రీకళ (నందంపూడి), కుసుమ వైష్ణవి (అంబాజీపేట) ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. మార్చి 24 నుంచి 26 వరకూ చెన్నైలో జరిగే జాతీయ స్థాయి ఎంపికల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడాకారులిద్దరినీ అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో కోచ్‌లు కె.దుర్గారావు, పి.మణికంఠ సోమవారం అభినందించారు.

సత్యదేవుని దర్శించిన 20 వేల మంది



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. రత్నగిరి పైన, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతూండటంతో ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి నెలకొంది. కుటుంబ సభ్యులతో కలసి నవదంపతులు సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత, విశ్రాంత మండపాలు నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ఆవుల చుట్టూ ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం అధికారులు తెలిపారు.





ఆలోచనలు ఒక్కటైతే...

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

వాలెంటైన్స్ డే సందర్భంగా యువ కలెక్టర్లతో ఇంటర్వ్యూ

- ముస్సోరి శిక్షణ కేంద్రంలో మొగ్గ తొడిగిన ప్రేమ
- అభిప్రాయాలు, ఆచలోనలతో ఒక్కటైన ఐఏఎస్ జంట
- ప్రేమ పెళ్లి చేసుకున్న కలెక్టర్లు హిమాన్షు శుక్లా, కృతికా
- ఎనిమిదేళ్లలో అరమరికలు లేని వైవాహిక జీవితం

రెండు మనసుల మధ్య బలమైన నమ్మకమే నిజమైన ప్రేమకు పునాది. పైపై అందాలు, ఆకర్షణలు ప్రేమను సజీవంగా ఉంచలేవు. బలమైన బంధంతో ఏర్పడే ప్రేమ కలకాలం సజీవంగా నిలిపి ఉంచుతుందని చాలా ప్రేమ వివాహాలు రుజువు చేస్తున్నాయి. ఇదిగో నిత్యం జిల్లా పాలనా వ్యవహారాలతో తలమునకలయ్యే ఈ ఐఏఎస్ దంపతులను చూస్తే ఈ మాట ముమ్మాటికీ నిజమేనని నిర్ధారణ అవక మానదు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికాశుక్లా, హిమాన్షు శుక్లాలు ప్రేమతో ఒక్కటైన వారే. ఎనిమిదేళ్ల క్రితం ముస్సోరిలోని సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రంలో వీరిద్దరి మధ్య తొలి ప్రేమ చిగురించింది. పరస్పర ఆలోచనలు ఒక్కటి కావడంతో వీరి ప్రేమ పెళ్లిపీటలెక్కింది. నేడు వాలెంటైన్స్ డే సందర్భంగా వారేమంటున్నారో వారి మాటల్లోనే..

- సాక్షి ప్రతినిధి, కాకినాడ

ముస్సోరిలో తొలిప్రేమ



మాది కాన్పూర్.. మొదటిసారి ముస్సోరిలో కృతికాను చూశాను. పరస్పరం గౌరవించుకునేవాళ్లం. తరచూ పలకరించుకునేవాళ్లం. ఆ సందర్భంలోనే పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. చాలా విషయాల్లో ఒకే తరహా వ్యక్తిత్వం కనిపించింది. నేనెలా ఉన్నానో ఆమె కూడా అలానే ప్రాక్టికల్‌గా ఉండటం గమనించాను. ముఖ్యంగా అర్థం చేసుకునే విషయం నుంచి అన్నింటి వరకూ. ఒకే సర్వీసుకు ఎంపికయినందున ఏమైనా సమస్యలుంటే చర్చించుకునేవాళ్లం. వ్యక్తిగతంగానే కాదు.. వృత్తిపరంగానూ ఒకే ఫీల్డుకు చెందడంతో మా మధ్య ప్రేమ మొగ్గ తొడిగింది. నేనే చొరవ తీసుకుని మా అమ్మానాన్నలు మంజుశుక్లా, ఎంఎల్ శుక్లాతో మా ప్రేమ విషయం చెప్పాను. అదృష్టం ఏమిటంటే వారిద్దరూ మా ప్రేమకు ఓకే చెప్పారు. సంప్రదాయం ప్రకారం అమ్మానాన్నలతో కలిసి చండీఘడ్ వెళ్లాం. కృతికా తల్లిదండ్రులు మదన్‌లాల్‌బత్రా, హర్షాబత్రాలను కలిశాం. పెళ్లి విషయం ప్రస్తావించాం. వారు కూడా అన్నీ విని సంతోషంతోనే అంగీకరించారు. అలా మా పెళ్లికి ప్రేమ సులభంగానే మార్గం చూపింది. ఒకే రకమైన వృత్తిని సౌకర్యవంతంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామంటే మా మధ్య ఉన్న పరస్పర అవగాహన, అభిప్రాయాలను పంచుకుని ఒక మాటకు రావడమే కారణం.



ఇరు కుటుంబాల కలయిక

ప్రేమ, పెళ్లి అనేవి సుదీర్ఘ జీవితానికి సంబంధించిన విషయాలు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని కాకుండా.. లైఫ్ గురించి అర్థం చేసుకోవాలి. అప్పుడే బతుకంతా సుందరంగా ఉంటుంది. ఏం కావాలి, ఏం చేయాలనేది ఇద్దరూ నిజాయితీగా మాట్లాడుకోవాలి. ప్రేమ, పెళ్లి అంటే ఇద్దరి కలయికే కాదు.. ఇరు కుటుంబాలను కలిపే బంధమని గుర్తించాలి. ఈ విషయంలో త్వరత్వరగా నిర్ణయాలు తీసుకోకూడదు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను అర్థం చేసుకోవాలి. పిల్లలు హ్యాపీగా ఉంటేనే మనం కూడా హ్యాపీగా ఉంటామని గుర్తించాలి. ఐఏఎస్ శిక్షణ తర్వాత సెలవు.. అదే సమయంలో మంచి రోజు సంక్రాంతి రానే వచ్చింది. ఎటువంటి అడ్డు లేకుండానే మా ప్రేమ పెళ్లి వరకూ వచ్చింది. ఇద్దరి మధ్య బలమైన నమ్మకమే ఇంతవరకూ తీసుకువచ్చిందని భావిస్తున్నాను. వృత్తి, వ్యక్తిగత జీవితంపై మా మధ్య స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే ఇంతవరకూ ఎప్పుడూ ఎటువంటి సమస్యా రాలేదు. నేటి తరం ప్రేమికులు మాలానే పెళ్లి చేసుకునే ముందే అన్నీ అర్థం చేసుకోవాలి. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి.

- హిమాన్షు శుక్లా, కలెక్టర్, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



ఎప్పుడూ మనస్పర్థలే రాలేదు



మాది చండీఘడ్. 2013 సెప్టెంబర్‌లో శిక్షణలో తొలిసారి హిమాన్షును చూశాను. రోజులు గడిచేకొద్దీ ఆయన ప్రాక్టికాలిటీ, వాస్తవానికి దగ్గరగా ఉండటం, సహజ ధోరణిలో సాగిన మాటలు నన్ను ఆకట్టుకున్నాయి. అదే ఆయన్ను ప్రేమించేలా చేశాయి. ఇద్దరం ప్రేమను వ్యక్తం చేసుకున్నాం. పరస్పరం అన్నీ అర్థం చేసుకున్నాక పెద్దల అంగీకారంతో, 2015 ఫిబ్రవరి 8న పెళ్లి చేసుకున్నాం. ఒకే వృత్తిలో ఉన్నాం. అర్థం చేసుకోవడానికి ఇది ఈజీగా దోహదపడింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎప్పుడూ ఏ విషయంలోనూ ఇద్దరి మధ్యా మనస్పర్థలు రాలేదు. నిజమైన ప్రేమ అలానే ఉంటుంది మరి! ఎనిమిదేళ్ల కెరీర్‌లో ఐదేళ్లు వేర్వేరు ప్రాంతాల్లో దూరంగా ఉన్నాం. వీకెండ్ లేదా రెండు వారాలకోసారి కలుసుకునేవాళ్లం. అప్పుడే అర్థం చేసుకున్నాం. జీవితం అంటే ఇలానే ఉంటుందని.. ఇవేవీ మా వ్యక్తిగత జీవితానికి ప్రతిబంధకం కావడం లేదు. ఇద్దరం కూడా వృత్తిలో ఎక్కడా రాజీ పడకూడదని ప్రేమలో పడినప్పుడే నిర్ణయించుకున్నాం. అలానే కొనసాగుతున్నా.

స్థిరపడ్డాకే ప్రేమ.. పెళ్లి

ప్రేమ విషయంలో అమ్మాయిలు చాలా ముందస్తుగా ఆలోచించాలి. స్కూల్, కాలేజీ స్థాయిలోనే ప్రేమ వ్యవహారాలతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. పరిస్థితులన్నీ ఒక కొలిక్కి వచ్చి ఆర్థికంగా నిలదొక్కుకున్నాకే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి. ఇవేమీ లేకుండా కేవలం రంగు, ఆకర్షణలతో ప్రేమ అంటూ అడుగులు వేస్తే భవిష్యత్ అంత బాగుండదు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి ద్వారా కొన్నాళ్లుగా చాటింగ్‌లు బాగా ఎక్కువైపోయాయి. మంచి కంటే చెడే ఎక్కువగా జరుగుతోందని అనుకుంటున్నాను. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఓ కంట గమనిస్తూ ఉండాలి. 18 ఏళ్లు నిండిన తరువాతనే పెళ్లి ఆలోచన రావాలి. ముఖ్యంగా అమ్మాయిలు మరింత జాగ్రత్తగా ఉండాలి. మగపిల్లలు ఏదో వ్యాపారం చేయడం మొదలుపెట్టగానే పెళ్లి చేస్తుంటారు. అమ్మాయిల విషయంలో కూడా తల్లిదండ్రులు ఇలానే ఆలోచించాలి. ఆర్థికంగా స్థిరపడి ఆలోచించే శక్తి వచ్చాకే పెళ్లి చేయాలి. నేను కూడా ఐఏఎస్ శిక్షణ పూర్తయ్యాకే పెళ్లి చేసుకున్నాను. జీవితంలో స్థిరపడ్డాక స్వతంత్రంగా ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చు.

- కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా



అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ

- అనంతరం పరిష్కారం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం రూరల్: స్పందన అర్జీలపై క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని, అనంతరం అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా సానుకూల పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) సీహెచ్ సత్తిబాబు జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి 188 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, పరిష్కారంపై అర్జీదారులు సంతృప్తి చెందని పక్షంలో మళ్లీ వచ్చే అవకాశాలుంటాయని అన్నారు. పూర్తి సంతృప్త స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తూ, గడువు దాటిన అర్జీలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సామాజిక భద్రతా పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- పంటు లేక 50 కిలోమీటర్లు తిరిగి కళాశాలకు చేరాల్సి వస్తోందని, పంటు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఓడలరేవు బీవీసీ కళాశాల విద్యార్థులు కోరారు.
- అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పితాని సత్యమహాలక్ష్మి రేషన్ కార్డు సాంకేతిక సమస్యల కారణంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఇద్దరు సచివాలయ ఉద్యోగుల పేర్లు ఉన్నాయి. దీంతో ఆమెకు గత ఏడాది ఆగస్టులో రేషన్ కార్డు, దివ్యాంగుల పెన్షన్ నిలిచిపోయాయి. దీనిపై డిసెంబర్‌లో జరిగిన స్పందనలో ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఉన్నతాధికారులతో స్వయంగా మాట్లాడి డిసెంబర్ నుంచి దివ్యాంగుల పెన్షన్ తిరిగి మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పౌర సరఫరా ఉద్యోగులు ఆమె ఇంటికి వెళ్లి, ఈ-కేవైసీ నమోదు చేసి, రేషన్ కార్డు మంజూరు చేశారని జిల్లా పౌర సరఫరా అధికారి పాపారావు తెలిపారు.
- ఆర్‌బీఐ సూచన మేరకు డీజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, సీవీవీ, పాస్‌వర్డ్, పిన్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలను గోప్యంగా ఉంచుకోవాలే తప్ప, ఎవ్వరితోనూ పంచుకోరాదనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.




స్పందనలో అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోలీసు స్పందనకు 39 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 39 అర్జీలు వచ్చాయి. వీటిలో భూ తగదాలు, కుటుంబ వివాదాలు వంటి సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. ఏఎస్పీ కె.లతామాధురి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి కూడా చివరిలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎస్పీ కార్యాలయ స్పందన పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకట రమణ కూడా పాల్గొన్నారు.

శివరాత్రికి 51 ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ద్రాక్షారామ, కోటిపల్లి శైవక్షేత్రాలకు ఏపీఎస్ ఆర్టీసీ 51 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. ఈ విషయాన్ని ఆర్టీసీ రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం విలేకర్లకు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. కాకినాడ – కోటిపల్లి 19, రామచంద్రపురం – కోటిపల్లి 10, యానాం – కోటిపల్లి 6, రాజమహేంద్రవరం – కోటిపల్లి 4, గొల్లల మామిడాడ – కోటిపల్లి 2, మండపేట – అంగర – కోటిపల్లి 2, రావులపాలెం – కొత్తూరు – అంగర – కోటిపల్లి 4, అమలాపురం – ముక్తేశ్వరం రేవు వరకూ 4 చొప్పున బస్సులు నడుపుతామని వెంకటేశ్వర్లు వివరించారు.

ఆక్వా జోన్ ప్రతిపాదనలపై పునఃపరిశీలన

- వారం రోజుల్లో సరైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం
- గ్రామాల్లో పరిశీలనకు జిల్లా అధికారులకు బాధ్యతలు

అమలాపురం రూరల్: ఆక్వా జోన్ ప్రతిపాదనలు సక్రమంగా లేవని, వీటిని పునఃపరిశీలించి, వచ్చే సోమవారం నాటికి కొత్త ప్రతిపాదనలు సక్రమంగా సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిబంధనలు ప్రకారం అర్హులందరినీ ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురావాలని, అనర్హులెవ్వరూ ఇందులోకి రాకూడదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత అంశాలపై జిల్లా మత్స్యశాఖ అధికారి షేక్ లాల్ మహమ్మద్ వివరించారు. మలికిపురం మండలం శంకరగుప్తంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, అల్లవరం మండలం గుండెపూడిలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, అమలాపురం మండలం తాండవపల్లిలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీపతిరావు, ఉప్పలగుప్తం మండలం పెదగాడవల్లిలో కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఇంజినీర్ జి.కరుణరేఖ, అయినవిల్లి మండలం నేదునూరులో ఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్‌లు ఆక్వా జోన్ల పరిధులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. 211 మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్లకు కమిటీ సభ్యుల అనుమతితో ఆమోదం తెలిపారు. ఆక్వా జోనేషన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, మత్స్య ఆంధ్ర కార్యక్రమాలను పూర్తి పారదర్శకంగా అమలు చేయాలని, మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

శాసన మండలికి స్థానిక సంస్థల కోటాలో వచ్చే నెల 13న జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధివిధానాలను, షెడ్యూల్‌ను వివరించారు. ఈ ఎన్నికలకు సంబంధించి అమలాపురం డివిజన్‌లోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు కలిపి 257 మంది తమ ఓటు హక్కును స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకోవాలని సూచించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రస్తుత రబీలో ఏ ఒక్క ఎకరానికీ నీటి ఎద్దడి తలెత్తకుండా మండల స్థాయిలో పంట కాలువ స్థాయి బృందాలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీలో సాగునీటి ఎద్దడి పరిష్కారం, వారాబందీ నిర్వహణ, ఎరువుల సరఫరా, ఈ-క్రాప్ బుకింగ్, లంక భూముల సర్వే పురోగతిపై సమీక్షించారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు సూచించారు. సోమవారం నిర్వహించిన కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకూ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టులపై 112 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మార్చి 15 నుంచి 29 వరకూ పాఠ్యాంశ పరీక్షలు రోజుకు ఒకటి చొప్పున జిల్లాలోని 38 కళాశాలల్లో నిర్వహిస్తారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 28,973 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, డీఈఓ ఎన్‌వీ రవిసాగర్, ఒకేషనల్ విద్యా శాఖ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) స్కిల్ హబ్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా నైపుణ్యాధికారి ఎం.కొండలరావు సోమవారం ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఉతీర్ణత లేదా ఆపై చదివి, 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఈ శిక్షణ పొందేందుకు అర్హులని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు మార్కుల జాబితా, ఆధార్ కార్డు కాపీలతో న్యాక్‌లోని స్కిల్ హబ్‌కు బుధవారం నేరుగా హాజరు కావాలని కొండలరావు సూచించారు. https://tinyurl.com/skillhubsphasell లింకు ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 91339 12947 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అదనపు కట్నం వేధింపులపై ముగ్గురిపై కేసు

కొవ్వూరు: కట్నం వేధింపులపై అందిన ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామానికి చెందిన భరత్, అతడి తల్లిదండ్రులు జ్యోతి, శ్రీనివాస్‌లపై కొవ్వూరు పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ కథనం ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన అంజూరి నళినీ క్రాంతికుమారికి భరత్‌తో 2016లో వివాహమైంది. వీరికి ఒక పాప జన్మించింది. కాపురం కొంతకాలం పాటు సజావుగా సాగింది. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు క్రాంతికుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

పిఠాపురం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ కథనం ప్రకారం.. తాటిపర్తికి చెందిన తుమ్మారి రామకృష్ణ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ నెల 9న ఇంటికి తాళం వేసి, కాకినాడలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. సోమవారం వచ్చేసరికి ఇంటి పక్క తలుపులు బద్దలుగొట్టి కనిపించాయి. చోరీ జరిగినట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగలు ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి 5 కాసుల బంగారు వస్తువులు, 300 గ్రాముల వెండి కడ్డీ, రూ.20 వేల నగదు దోచుకున్నారు. మరో మూడు కేజీల వెండి కంచాలు, గ్లాసులు మాత్రం వదిలేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందంలో.. తగ్గేదే..లే..



- వధూవరుల సొగసులకు మెరుపులు.. మెరుగులు
- అందుబాటులోకి అత్యాధునిక పద్ధతులు
- బ్యూటీషియన్లకు పెరిగిన ఆదరణ
- పెళ్లిళ్ల సీజన్‌లో వీరిదే హవా
- ఈ వృత్తిలో నిలదొక్కుకుంటున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: పెళ్లి ఓ అందమైన కల. ఆ మధుర స్వప్నం కలకాలం గుర్తుండిపోయేలా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. స్థాయిని బట్టి కొంతమంది వివాహం సంప్రదాయబద్ధంగా జరుపుకొంటూ.. ఫొటోలు, వీడియోలతో సరిపెట్టుకుంటారు. కాస్త స్థితిమంతులు నిశ్చితార్థం.. మెహందీ.. సంగీత్.. వధూవరుల అలంకరణ.. రిసెప్షన్.. వివాహం.. బాణసంచా కాల్పులు.. బ్రహ్మాండమైన విందు.. ప్రతి సందర్భంలోనూ సినిమా సన్నివేశాన్ని తలపించేలా ఫొటో, వీడియో షూట్లతో అట్టహాసంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఖర్చుకు ఎక్కడా 'తగ్గేదే... లే..' అన్నట్టుగా ఉంటారు.

వివాహ వేళ ఒకప్పుడు వధూవరుల అలంకరణ చాలా మామూలుగా చేసేవారు. మహా అయితే వధువుకు పట్టుచీర, పూలజడ.. వరుడికి కొత్త దుస్తులు.. ఇద్దరికీ గోరింటాకు, కాస్తంత బంగారు ఆభరణాలు –దాదాపు ఇవే ఉండేవి. ఇప్పుడలా కాదు.. మూడుముళ్లతో ఒక్కటయ్యే ఈ జీవన బంధాన్ని కలకాలం తీపి జ్ఞాపకంగా పదిలపరచుకోవాలని చాలామంది కోరుకుంటున్నారు. ఇందులో భాగంగా పెళ్లిళ్లలో వధూవరుల అలంకరణకు ఎక్కడలేని ప్రాధాన్యమూ వచ్చింది. ఈ క్రమంలోనే బ్యూటీషియన్లకు డిమాండూ పెరుగుతోంది.

అందానికి అధిక ప్రాధాన్యం

వివాహ వేడుకల్లో వినియోగించే ప్రతీదీ అందరికంటే భిన్నంగా, సరికొత్తగా ఉండాలని అనుకోవడం సహజం. అన్నింటికన్నా అందం విషయంలో అయితే ఏమాత్రం రాజీ పడే సమస్యే లేదని అంటున్నారు ఈ తరం వధూవరులు. ఈ క్రమంలోనే పెళ్లికి ముందు బోలెడంత ఖర్చు పెట్టి సొగసులకు మెరుపులు, మెరుగులు అద్దుతున్నారు. ఫేషియల్స్ (ముఖాన్ని అందంగా తీర్చిదిద్దడం), మానిక్యూర్ (చేతులు, వేళ్లను అందంగా తీర్చిదిద్దడం), పెడిక్యూర్ (పాదాలను అందంగా తీర్చిదిద్దడం), వ్యాక్స్ (అవాంఛిత రోమాలను తొలగించడం), ఐబ్రోస్ (కనుబొమ్మలను అందంగా తీర్చిదిద్దడం) వంటివి చేయించుకుంటున్నారు. పెళ్లి రోజు మేకప్, బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, స్టైలిష్ హెయిర్ కట్స్ చేయించుకోవడం.. లేకపోతే ఉన్న జుట్టుతోనే ఆకట్టుకునే హెయిర్ స్టైల్స్‌కు ప్రయత్నించడం వంటివి బ్యూటీషియన్లతో చేయించుకుంటున్నారు.



వరుడికి ఫేషియల్

ట్రెండ్ మారింది గురూ..

గతంలో ధనిక, పట్టణ ప్రాంత వాసులు మాత్రమే బ్యూటీపార్లర్లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలూ బ్యూటీపార్లర్లను ఆశ్రయిస్తున్నారు.



వధువుకు మేకప్ చేస్తున్న బ్యూటీషియన్

ఫలితంగా ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన బ్యూటీపార్లర్లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో బ్యూటీషియన్లకు చేతుల నిండా పని దొరుకుతోంది. ఎవరి స్థాయికి తగినట్టు వారు బ్యూటీషియన్లతో బ్రైడల్ మేకప్ చేయించుకుంటున్నారు. ఇందుకోసం రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకూ ఖర్చు చేస్తున్నారు.



ఎంతో మంది మహిళలు బ్యూటీషియన్లుగా ఉపాధి పొందుతున్నారు. ఈ వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకొని ఇంటి వద్ద బ్యూటీపార్లర్లు ఏర్పాటు చేసుకొని, స్వయం ఉపాధి పొందుతున్నారు. మరోపక్క మగవారికి సెలూన్లే బ్యూటీపార్లర్లుగా సేవలందిస్తున్నాయి. పెళ్లికి కొద్ది రోజుల ముందు నుంచి వరుడు తన అందానికి ఇక్కడే మెరుగులు దిద్దుకుంటున్నాడు. వీటికి కూడా రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది.

అందానికి మరింత మెరుగులు



పెళ్లిళ్లలో అందానికి మరింత మెరుగు దిద్దుకోవడంపై వధూవరులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లి వేడుకల్లో అన్ని వర్గాల వారూ బ్యూటీషియన్లను ఆశ్రయిస్తున్నారు. పెళ్లి వేడుకల్లో ఇతర ఖర్చులతో పోల్చితే అందానికి పెట్టే ఖర్చు తక్కువే. సాధారణ రోజులతో పోలిస్తే పెళ్లిళ్ల సీజన్‌లో మా వద్దకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది.

– నందూరి లలిత, బ్యూటీషియన్, హరి బ్యూటీ పార్లర్, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

ఆదరణ పెరుగుతోంది



పెళ్లి వేళ అందానికి ప్రాధాన్యం ఇవ్వడంలో అమ్మాయిలకు అబ్బాయిలు ఎక్కడా తీసిపోవడం లేదు. ముహూర్తం పెట్టిన నాటి నుంచీ అబ్బాయిలు ఫేషియల్స్ చేయించుకుంటుంటున్నారు. పెళ్లి కొడుకులను మేమే స్వయంగా అలంకరించి, అందంగా తీర్చిదిద్దుతున్నాం.

– డి.బుజ్జి, హశ్రీ సెలూన్, ప్రత్తిపాడు

మరణించి.. మరో ఇద్దరిని బతికించి..

గ్రీన్ కారిడార్‌లో విశాఖకు కిడ్నీ తరలింపు

కాకినాడ క్రైం: తాను మరణిస్తూ మరో ఇద్దరికి పునర్జన్మనిచ్చారు కాకినాడకు చెందిన నాగేంద్ర సింగ్. బ్రెయిన్ డెడ్ అయిన ఆయన కిడ్నీలను.. తన చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు దానం చేశారు. వివరాలివీ.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన క్షత్రి నాగేంద్ర సింగ్ స్థానిక మందుల దుకాణంలో పని చేస్తుండేవారు. ఈ నెల 10న రోడ్డు ప్రమాదానికి గురై, కాకినాడ అపోలో ఆసుపత్రిలో చేరారు. తలపై గాయం కారణంగా అప్పటికే నాగేంద్రకు బ్రెయిన్ డెడ్ అయ్యింది. బతికేందుకు ఏమాత్రం ఆస్కారం లేదని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆయన కోరిక మేరకు రెండు కిడ్నీలనూ దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. అదే సమయంలో ఏపీ జీవన్‌దాన్ ప్రోగ్రాం నుంచి నాగేంద్ర కిడ్నీలను ఇద్దరికి అమర్చేందుకు అనుమతి వచ్చింది. దీంతో విశాఖపట్నం కిమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి ఒక కిడ్నీ అమర్చాలని వైద్యులు నిర్ణయించారు. కుటుంబ సభ్యుల అనుమతితో అపోలో వైద్యులు నాగేంద్ర శరీరం నుంచి రెండు కిడ్నీలను వేరు చేశారు. ఓ కిడ్నీ అపోలో ఆసుపత్రిలోనే ఉన్న వ్యక్తికి అమర్చగా.. రెండో కిడ్నీని విశాఖ తరలించేందుకు జిల్లా పోలీసు శాఖ సాయం తీసుకున్నారు. వీలైనంత తక్కువ సమయంలో కిడ్నీని తరలించే లక్ష్యంతో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు కాకినాడ నుంచి విశాఖపట్నానికి గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేశారు. దీంతో రెండున్నర గంటల వ్యవధిలోనే ఆ కిడ్నీ విశాఖ కిమ్స్ వికాస ఆసుపత్రికి చేరింది. అక్కడి వైద్యులు తక్షణమే రోగి శరీరంలో కిడ్నీ అమర్చి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించారు. నాగేంద్ర ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని అంచనా వేయడంలో న్యూరోసర్జన్ డాక్టర్ కిరణ్‌కుమార్ కీలక పాత్ర పోషించగా.. మొత్తం ఈ ప్రక్రియలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ జీవీ రావు, యూరాలజిస్టు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ శర్మిష్ఠ, డాక్టర్ ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ జె.మణికంఠన్ ప్రధాన భూమిక పోషించారని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఛటర్జీ, అపోలో ఆసుపత్రి మేనేజర్ రమణ వివరించారు.



ప్రత్యేక ఏర్పాట్ల మధ్య కిడ్నీని విశాఖకు తరలిస్తున్న అపోలో సిబ్బంది

యూరియా కొరత లేదు

వ్యవసాయ కమిషనరేట్ జేడీ కృపాదాస్

సామర్లకోట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో యూరియాకు ఎక్కడా కొరత లేదని వ్యవసాయ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ కృపాదాస్ తెలిపారు. ఎస్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా బస్తాలతో సామర్లకోట వచ్చిన రైలు వ్యాగన్లను సోమవారం ఆయన పరిశీలించారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు రైలు వ్యాగన్ల ద్వారా 2,600 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని చెప్పారు. కాకినాడ జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకే)కు 678.75 మెట్రిక్ టన్నులు, ఎరువుల దుకాణాలకు 671.25 మెట్రిక్ టన్నులు; కోనసీమ జిల్లాలోని ఆర్‌బీకేలకు 354.37 మెట్రిక్ టన్నులు, ఎరువుల దుకాణాలకు 345.63 మెట్రిక్ టన్నులు; తూర్పు గోదావరి జిల్లాలోని ఆర్‌బీకేలకు 253.13 మెట్రిక్ టన్నులు, ఎరువుల దుకాణాలకు 246.87 మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేస్తామని వివరించారు. కాకినాడ జిల్లాలో 1,88,352 ఎకరాలకు గాను, 1,65,500 ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని కృపాదాస్ తెలిపారు. దీనికి 31 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావలసి ఉండగా 21,240 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని చెప్పారు. కాకినాడ జిల్లాలో రబీ పంట కాలానికి పూర్తిగా సరిపోయే స్థాయిలో యూరియా నిల్వలున్నాయన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీవీ పద్మశ్రీ, వ్యవసాయాధికారులు ఐ.సత్య, పద్మజారాణి, పి.పవిత్ర, ఏఈఓ ఎంవీ సతీష్, ఎస్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు రామ్మోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.



రైలు వ్యాగన్‌లో వచ్చిన యూరియాను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సెల్‌ఫోన్ పోతే పోలీసు హెల్ప్

కాకినాడ క్రైం: చోరీల బారిన పడి సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటున్న వారికి జిల్లా పోలీసు శాఖ సాంత్వన కల్పించింది. అధునాతన సాంకేతికత అనుసంధానంతో 'మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్' సేవలను జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా వాట్సాప్ మెసేజ్‌తో ఫిర్యాదు నమోదు చేసే వెసులుబాటు కల్పించారు. ఇందుకు చేయాల్సిందేమిటంటే, సెల్‌ఫోను పోగొట్టుకున్న వారు 94906 17852 నంబరుకు వాట్సాప్‌లో 'హెచ్‌ఈఎల్‌పీ' అని టైప్ చేసి పంపాలి. తక్షణమే పోలీసుల నుంచి వెల్‌కం లింక్ వస్తుంది. అందులో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబరు, ఫిర్యాదీ పేరు, చిరునామా, వాడిన సెల్‌ఫోన్ నంబర్‌తో పాటు కోరిన ఇతర వివరాలు పొందుపరచాలి. సబ్‌మిట్ బటన్ నొక్కిన వెంటనే అవి నేరుగా పోలీసు ఐటీ కోర్ విభాగానికి చేరుతాయి. అప్పటికప్పుడే బాధితులు పోగొట్టుకున్న ఫోన్ ట్రాకింగ్ మొదలవుతుంది. ఫోన్ దొరకగానే బాధితులకు పోలీసులు అందజేస్తారు.

90 సెల్‌ఫోన్ల రికవరీ

వివిధ కారణాలతో ప్రజలు పోగొట్టుకున్న 90 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వీటిలో పలు ఫోన్లు చోరీ అవగా, కొన్ని పోగొట్టుకున్నవి, మరికొన్ని మరిచిపోయినవి ఉన్నాయని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్నామంటూ పలువురు బాధితులు కొన్నాళ్లుగా పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఐటీ కోర్, సీసీఎస్ సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఎస్పీ ఏర్పాటు చేశారు. వారి కృషితో 90 సెల్‌ఫోన్లు రికవరీ అయ్యాయి. వీటిని మీడియా సమక్షంలో బాధితులకు ఎస్పీ అప్పగించారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

రేపటి నుంచి సీనియర్ వుమెన్ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ 13వ జాతీయ స్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీలు కాకినాడలో నిర్వహిస్తున్నారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బీఎం చాణుక్యరాజ్ ఈ విషయం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) మార్గనిర్దేశంతో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది డీఎస్ఏలో జాతీయ స్థాయి జూనియర్స్ విభాగం పోటీలు విజయవంతంగా నిర్వహించామని, దీంతో ఈ ఏడాది సీనియర్స్ విభాగం పోటీల నిర్వహణకు అవకాశం దొరికిందని ఆయన తెలిపారు. హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పోటీల్లో 26 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. హాకీ ఇండియా నుంచి అంపైర్లు వస్తున్నారన్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ సలహాదారు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, 80 సంవత్సరాల హాకీ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఈ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ వి.రవిరాజు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన 17 సమన్వయ శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే సమావేశం నిర్వహించామని రవిరాజు తెలిపారు. విలేకర్ల సమావేశంలో హాకీ ఆంధ్రప్రదేశ్ కోశాధికారి పి.థామస్ పీటర్, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ హాకీ పోటీల వివరాలు వెల్లడిస్తున్న రవిరాజు

వివాహిత ఆత్మహత్య కేసులో ముద్దాయిలకు జైలుశిక్ష

సీతానగరం: వివాహిత ఆత్మహత్య కేసులో ముద్దాయిలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చినకొండేపూడికి చెందిన గెడ్డం కల్యాణికి, కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన సోడదాసి పాల్ ఫ్రాన్సిస్(టింకూ)తో గతంలో వివాహం జరిగింది. భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేక కల్యాణి 2018 డిసెంబర్ 3న చినకొండేపూడిలోని పుట్టింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఆమె మేనమామ చిడిపి అబ్బులు అప్పటి ఎస్సై ఎ.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం అత్తింటి వారి వేధింపులు భరించలేకే కల్యాణి ఆత్మహత్య చేసుకున్నట్టు భర్త పాల్ ఫ్రాన్సిస్, అత్త సోడదాసి బేబీ, ఫ్రాన్సిస్ అమ్మమ్మ చెరుకూరి సరోజనిపై కేసు నమోదు చేశారు. నిందితులను అప్పటి కోరుకొండ సీఐ ఆర్‌జే రవికుమార్ అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. అనంతరం ఈ కేసులో సీతానగరం ఎస్సై కె.శుభశేఖర్ 22 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఏపీపీ వెంకటరత్నం ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు విచారణ అనంతరం ఫ్రాన్సిస్‌కు ఏడేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా, సోడదాసి బేబీ, చెరుకూరి సరోజనిలకు రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఒకటో అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు ఇచ్చారు.

ఐఈఈటీఈ స్టూడెంట్ ఫోరం ప్రారంభం

గండేపల్లి: ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం ద్వారా ఇంజినీరింగ్ విద్యలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచే అవకాశం ఉంటుందని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్, ఐఈటీఈ సెంటర్ చైర్మన్ బీటీ కృష్ణ అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఐఈటీఈ స్టూడెంట్ ఫోరాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందులో విశిష్ట అతిథిగా పాల్గొన్న కృష్ణ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్య అనంతరం ఉద్యోగం చేసుకుంటూ మాస్టర్స్ చేసే అవకాశం ఐఈటీఈ విద్యార్థులకు ఉంటుందని తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాల్ మేడపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆదిత్య కళాశాలలకు 2009 నుంచి ఐఈటీఈ కార్పొరేట్ మెంబర్ హోదా ఉందని, దీంతోపాటు ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం ద్వారా ఈసీఈ విభాగ విద్యార్థులకు సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై మరిన్ని అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఈసీఈ విభాగాధిపతి రాధ మాట్లాడుతూ, ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం సభ్యులుగా ప్రస్తుతం 310 మంది విద్యార్థులున్నారని తెలిపారు. కళాశాలల డీన్ జి.సురేష్ కూడా ప్రసంగించారు. ఆయనను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఐఈటీఈ కో ఆర్డినేటర్ ఎస్.జగదీష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న ఆదిత్య సిబ్బంది

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నేడు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రధాన ఆర్టీసీ బస్ స్టేషన్ల అభివృద్ధిపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిలా అశోక సోమవారం ఈ విషయం తెలిపారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురాల్లో పీపీపీ విధానం కింద అన్ని సదుపాయాలతో కొత్త బస్ స్టేషన్ల నిర్మిస్తామని, ఖాళీ స్థలాలను వ్యాపారాల నిమిత్తం 33 ఏళ్ల లీజుకు ఇస్తామని వివరించారు. ఈ మూడు బస్ స్టేషన్లకు సంబంధించి రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని శిక్షణ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని షర్మిలా అశోక తెలిపారు.